క్లుప్తంగా

దేవరకొండ వాసికి జర్నలిజంలో డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న రవికుమార్

దేవరకొండ : దేవరకొండకు చెందిన తూటుపల్లి రవికుమార్ ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి జర్నలిజం విభాగంలో డాక్టరేట్ అందుకున్నారు. 'బాలల హక్కులు–మీడియా కవరేజి' అనే అంశంపై పరిశోధన చేసినందుకుగాను శుక్రవారం డాక్టరేట్ అందజేశారు. సీనియర్ ప్రొఫెసర్ పీయల్.విశ్వేశ్వర్‌రావు పర్యవేక్షణలో నేడు సమాజంలో చిన్న పిల్లలు..వారికి మీడియా ఇస్తున్నటువంటి ప్రాముఖ్యత ఏ స్థాయిలో ఉందనే విషయం మీద పరిశోధన చేసినట్లు రవికుమార్ తెలిపారు. రోజు రోజుకు చిన్న పిల్లలపై సమాజంలో జరుగుతున్న ఆకృత్యాలు, ప్రభుత్వాల నుంచి వారికి కల్పిస్తున్న భరోసా, సమాజానికి దిక్సూచిగా ఉన్న మీడియా భవిష్యత్ తరానికి ప్రాధాన్యత ఇస్తుందనే విషయాన్ని కూడా సవివరంగా పరిశోధించినట్లు ఆయన తెలిపారు. రవికకుమార్ డాక్టరేట్ అందుకోవడంపై పలువురు ఆయనను అభినందించారు.

మూడు ఉద్యోగాలు సాధించిన యువకుడు



చాగంటి రాజు

త్రిపురారం : పట్టుదలతో చదువుకుంటే ఏదైనా సాధ్యమేనని మండలంలోని నీలాయిగూడెం గ్రామానికి చెందిన చాగంటి వెంకటేశ్వర్లు ముత్యాలమ్మ దంపతుల కుమారుడు చాగంటి రాజు నిరుపించాడు. చాగంటి రాజు మొదట గురుకుల పీజీటీ ఇంగ్లీష్, టీజీటీ ఇంగ్లీష్ ఉద్యోగాలు సాధించాడు. ప్రస్తుతం మూడో ఉద్యోగం జూనియర్ లెక్చరర్‌గా ఎంపికయ్యాడు. పేద కుటుంబంలో పుట్టిన రాజు మూడు ఉద్యోగాలు సాధించడంతో గ్రామస్తులు అతడిని అభినందించారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

వేములపల్లి : ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతున్న నాలుగు ట్రాక్టర్లను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం వేములపల్లి మండలం రావులపెంట గ్రామానికి చెందిన కొక్కు రాము, గంగు సతీష్‌రెడ్డి, లక్ష్మీదేవిగూడెం గ్రామానికి చెందిన చింతకాయల భిక్షం, మిర్యాలగూడ మండలం దొండవారిగూడెం గ్రామానికి చెందిన శ్రీధర్‌లు తమ ట్రాక్టర్ల ద్వారా రావులపెంట గ్రామ శివారులోని మూసివాగు నుంచి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తుండగా శెట్టిపాలెం గ్రామ శివారులో పట్టుకున్నామన్నారు. ఈమేరకు ట్రాక్టర్లను స్టేషన్‌కు తరలించి రాము, సతీష్‌రెడ్డి, భిక్షం, శ్రీధర్‌లతోపాటు ట్రాక్టర్లపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

కేశవాపురంలో పశువైద్య శిబిరం

మిర్యాలగూడ : పశుగణాభివృద్ధి సంస్థ, పశుసంవర్థకశాఖ ఆధ్వర్యంలో దామరచర్ల మండలంలోని కేశవాపురం గ్రామంలో శనివారం గోపాలమిత్ర పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కొండ్రపోల్ పశువైద్యాధికారి డాక్టర్ స్వప్న మాట్లాడుతూ వైద్యశిబిరంలో 44గేదెలకు పలు రకాల వ్యాధులను గుర్తించి వాటికి సంబంధించిన వైద్యాన్ని అందించినట్లు తెలిపారు. అదేవిధంగా 26దూడలకు నట్టల నివారణ మందులను తాగించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గోపాలమిత్ర సూపర్‌వైజర్ శివారెడ్డి, గోపాలమిత్రలు భిక్షనాయక్, బాలాజీనాయక్ రైతులు పాల్గొన్నారు.

చెకుముకి టాలెంట్ టెస్ట్‌లో విద్యార్థుల ప్రతిభ

హాలియా : జన విజ్ఞాన వేదిక నల్లగొండ శాఖ ఆధ్వర్యంలో హాలియా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో వివిధ పాఠశాలల విద్యార్థులకు మండలస్థాయి చెకుముకి పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో స్థానిక టైం స్కూల్‌కు చెందిన విద్యార్థులు జశ్వంత్, దీక్షితకుమార్, సాయి భవజ్ఞ ఉత్తమ ప్రతిభ కనబర్చి మొదటి స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా విజేతలుగా నిలిచి జిల్లా స్థాయికి ఎంపికైన విద్యార్థులకు జన విజ్ఞాన వేదిక జిల్లా బాధ్యులు లింగాల సైదులు బహుమతులు అందజేశారు. జిల్లాస్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ పోటీలకు ఎంపికైన విద్యార్థులను పాఠశాల డైరెక్టర్ మందా నరేందర్ రెడ్డి, పాఠశాల ప్రిన్స్‌పాల్ కత్తి కోటిరెడ్డి అభినందించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

పెద్దవూర: నందికొండ మున్సిపాలిటీ పరిధిలోని హిల్‌కాలనీ బీసీ గురుకుల కళాశాలకు చెందిన మణికంఠ అండర్–19 విభాగంలో రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ జట్టుకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రాజశేఖర్ శనివారం తెలిపారు. ఈ నెల 9న నల్లగొండ డాన్‌బోస్కో స్కూల్‌లో ఉమ్మడి జిల్లా స్థాయి అండర్–19 విభాగంలో నిర్వహించిన ఫుట్‌బాల్ పోటీలో అత్యుత్తమ ప్రతిభ కనపర్చడంతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ నెల 24,25 తేదీలలో మహబూబ్‌నగర్‌లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీడీ జ్యోతి, పీఈటీ నర్సింహ తదతరులు పాల్గొన్నారు.

భవిష్యత్‌కు దిక్సూచి.. డిండి ఐటీఐ

- కళాశాలలో నూతనంగా అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటు
- శిక్షణ అనంతరం స్వయం ఉపాధి, పరిశ్రమల్లో ఉద్యోగాలు
- నూతన కోర్సుల ప్రవేశంతో పారిశ్రామిక విద్యపై ఆసక్తి చూపుతున్న విద్యార్థులు



డిండి ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ



నూతనంగా నిర్మిస్తున్న అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్

డిండి : పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు ఐటీఐ(ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఇనిస్ట్యూట్)లో చేరడానికి ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు. ఇందుకు కారణం కోర్సు పూర్తి కాగానే ఉపాధి దొరుకుతుంది.. లేకపోతే స్వయం ఉపాధినైనా పొందవచ్చునని భావిస్తున్నారు. ఇలాంటి ఎంతో మంది విద్యార్థులకు అండగా నిలిచింది డిండిలోని ప్రభుత్వ ఐటీఐ. 42ఏళ్లగా విద్యార్థుల భవిష్యత్‌కు బాటలు వేసింది.

నూతనంగా అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్

మండల కేంద్రంలో ఐటీఐతో పాటు నూతనంగా కొత్త కోర్సులతో మరో అడ్వాన్స్ ట్రైనింగ్ సెంటర్ (ఏటీసీ)ని ఇటీవల ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా మాన్యుఫాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ అండ్ ఆటోమేషన్(సంవత్సరం కోర్సు), ఇండస్ట్రియల్ రోబోటిక్స్ అండ్ డిజిటల్ మాన్యుఫాక్చరింగ్(సంవత్సరం కోర్సు), ఆర్టిసన్ యూజింగ్ అడ్వాన్స్ టూల్స్(సంవత్సరం కోర్సు), బేసిక్ డిజైనర్ అండ్ వర్చువల్ వెరిఫైయర్(మెకానికల్)(రెండు సంవత్సరాల కోర్సు), అడ్వాన్స్ సీఎన్‌సీ మెషినింగ్ టెక్నీషియన్(రెండు సంవత్సరాల కోర్సు), మెకానిక్ ఎలక్ట్రిక్ వెహికిల్(రెండు సంవత్సరాల కోర్సు)తదితర కొత్త అడ్వాన్స్ ట్రేడ్‌లలో ఈ ఏడాది ఇప్పటి వరకే 192 సీట్లకుగాను 192 మంది విద్యార్థులు శిక్షణా పొందుతున్నారు.

ఇతర జిల్లాలనుంచి రాక.

నల్లగొండ జిల్లా కేంద్రానికి దాదాపు 100 కిలోమీటర్ల దూరంలో ఉన్న డిండి మండల కేంద్రంలో 1981 అక్టోబర్ 3న ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థను (ఐటీఐ)ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అప్పటి నుంచి ఈ శిక్షణా కేంద్రానికి ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని దేవరకొండ, మఠంపల్లి, సూర్యాపేట, హాలియా, మిర్యాలగూడ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని కల్వకుర్తి ఆమన్‌గల్, జడ్చర్ల, నాగర్‌కర్నూల్, తెల్కపల్లి, అచ్చంపేట, ఉప్పునుంతల, వంగూర్ తదితర ప్రాంతాల నుంచి విద్యార్థులు వస్తుంటారు. ఇక్కడ శిక్షణ పొందిన విద్యార్థులు ప్రభుత్వ రంగాల్లో(బీహెచ్‌ఈఎల్, బీడీఎల్) ప్రభుత్వ ఉద్యోగులుగా పని చేస్తున్నారు. మరికొంత మంది స్వయం ఉపాధిని సంపాదించుకున్నారు. ఈ ఏడాది ఐటీఐలో 2024–2025 సంవత్సరానికి సంబందించి ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, సివిల్, కోపా, స్టెనో ట్రేడ్‌లలో 96మంది శిక్షణ పొందుతున్నారు.

వసతి సౌకర్యం లేక ఇబ్బందులు

ఇతర దూరం ప్రాంతాల నుంచి ఈ ఐటీఐకి వచ్చే విద్యార్థులకు వసతి సౌకర్యం లేకపోవడంతో ఇబ్బందికరంగా మారింది. పేద కుటుంబానికి చెందిన పలువురు విద్యార్థులు మండల కేంద్రంలో గదులు అద్దెకు తీసుకొని శిక్షణా పొందే సమయంలో ఆర్థిక భారం పడుతుండటంతో వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఐటీఐకి సంబంధించిన వసతి సౌకర్యం కొన్నేళ్ల పాటు ఉండేదని ఆ తర్వాత బంద్ చేశారని, ప్రస్తుతం తిరిగి వసతి సౌకర్యం కల్పించాలని విద్యార్థులు కోరుతున్నారు.

వసతి సౌకర్యం కల్పించాలి



ఇతర దూరం ప్రాంతాల నుంచి మండల కేంద్రంలోని ఐటీకి వచ్చి శిక్షణ పొందుతున్న విద్యార్థులకు స్థానికంగా ప్రభుత్వ క్యాంపస్ సౌకర్యం లేక పోవడంతో ఇబ్బందులకు గురవుతున్నాం. ప్రజాప్రతినిధులు, జిల్లా ఉన్నతాధికారులు వెంటనే స్పందించి క్యాంపస్ సౌకర్యం ఏర్పాటుచేయాలి.

– బి. అనిత విద్యార్థిని

చాలా ఆనందంగా ఉంది



ప్రభుత్వ ఉద్యోగాలపైనా ఆధారపడకుండా యువత ఉపాధి ద్వారా స్వయం శక్తితో ముదుకెళ్లాలని ప్రభుత్వం ఇటీవల మండల కేంద్రంలో నూతనంగా అడ్వాన్స్ ట్రైనింగ్ సెంటర్‌ను ప్రారంభించటం చాలా ఆనందంగా ఉంది. విద్యార్థులు చాలా వరకు ఐటీఐ. ఏటీసీ వైపు చూస్తున్నారు.

బి. సాయికుమార్ ఏటీసీ విద్యార్థి

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం



మండల కేంద్రంలోని ఐటీఐతోపాటు ఇటీవల ప్రారంభించిన కొత్త అడ్వాన్స్‌డ్ ట్రేడ్‌లలో శిక్షణ పొందుటుకు ఎక్కువ మొత్తంలో విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులకు వసతి సౌకర్యం లేదు. దీంతో ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయంపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా.

– వి. రాధాకృష్ణ, ప్రిన్సిపాల్ ఐటీఐ, డిండి

పనుల పురోగతిపై ప్రతివారం నివేదిక అందించాలి

- మిర్యాలగూడ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ : పట్టణంలో నిర్వహిస్తున్న పలు అభివృద్ధి కార్యక్రమాలపై తనకు ప్రతివారం సంబంధిత అధికారులు నివేదిక అందించాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మున్సిపల్, జాతీయ రహదారి, ప్రజారోగ్యం శాఖల అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో పట్టణంలో విఫలమైన అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ వ్యవస్థతో పాటు రోడ్ల విస్తరణ, ప్రధాన రహదారులు మరమ్మతు పనులు, లైటింగ్ ఏర్పాట్లపై ప్రతి వారం పూర్తయిన పనుల పురోగతిపై తనకు నివేదిక అందించాలని ఆదేశించారు. పనుల్లో ఎలాంటి అలసత్వం వహించకుండా త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే

దేవరకొండ : విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. శనివారం రాత్రి మండల పరిధిలోని కస్తూర్బా బాలికల పాఠశాల వసతి గృహాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా వసతి గృహంలో విద్యార్థినులకు అందిస్తున్న భోజనం, అక్కడి వసతుల గురించి ఆయనను అడిగి తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఉపాధ్యాయులకు సూచించారు. సంక్షేమ వసతి గృహాల్లోని విద్యార్థులకు మెరుగైన పౌష్టికాహారం కోసం డైట్ ఛార్జీలు, వ్యక్తిగత పరిశుభ్రత కోసం కాస్మొటిక్ ఛార్జీలను ప్రభుత్వం పెంచినట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులతో కలిసి ఆయన భోజనం చేశారు. ఎమ్మెల్యే వెంట ఆలంపల్లి నర్సింహ, వెంకటేశ్వరరావు, పున్న వెంకటేశ్వర్లు, వడ్త్య దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శి కుటుంబాన్ని ఆదుకోవాలి

త్రిపురారం : ములుగు జిల్లా వాజేడు మండలంలో పోలీస్ ఇన్‌ఫార్మర్‌గా పని చేస్తున్నాడనే నెపంతో మావోయిస్టులు చంపిన పంచాయతీ కార్యదర్శి రమేశ్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదు కోవాలని నల్లగొండ జిల్లా పంచాయతీ కార్యదర్శుల సంఘం గౌరవ అధ్యక్షుడు రాజేందర్ అన్నారు. శనివారం శనివారం త్రిపురారం మండల కేంద్రంలో రమేశ్‌ను చంపడానిన ఖండిస్తూ నిరసన తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రమేశ్ కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. విధులు నిర్వహిస్తున్న వారిని చంపడం దారుణమని, రాష్ట్రంలో కార్యదర్శులకు రక్షణ కరువైందన్నారు. అటవి ప్రాంతాల్లో పనిచేస్తున్న కార్యదర్శుల రక్షణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, రమేష్ కుటుంబానికి తక్షణమే రూ. కోటి ఆర్థిక సాయం ప్రకటించి కుటుంబ సభ్యులలో ఒక్కరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. మృతిపై రెండు నిమిషాలు మౌనం పాటించారు.

ఎక్స్‌ప్రెస్ బస్సులు నడపాలని డీఎంకు వినతి



డీఎంకు వినతిపత్రం అందజేస్తున్న బీసీ సంఘాల నాయకులు

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ డిపో నుంచి హైదరాబాద్‌కు ఎక్స్‌ప్రెస్ బస్సులు ప్రయాణికులకు తగిన విధంగా నడిపించాలని కోరుతూ శనివారం డిపో మేనేజర్ రాంమోహన్‌రెడ్డికి బీసీ సంఘాల ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీసీ సంఘాల అసెంబ్లీ నియోజకవర్గ జేఏసీ కన్వీనర్ నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఎక్స్‌ప్రెస్, పల్లె వెలుగులకు మాత్రమే ఉచిత ప్రయాణం పెట్టారని, దీంతో ప్రయాణికుల రద్దీ మరింత పెరిగిందని, రద్దీకి తగిన విధంగా ఎక్స్‌ప్రెస్ బస్సులు లేకపోవడంతో మహిళలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. మిర్యాలగూడ నుంచి హైదరాబాద్‌కు వెళ్లలంటే కోదాడ డిపో నుంచి వచ్చే బస్సుల కోసం ఎదురు చూడాల్సి వస్తుందన్నారు. ప్రభుత్వం అమలు చేసిన ఉచిత ప్రయాణం నీరుగారిపోతుందన్నారు. మిర్యాలగూడ నుంచి హైదరాబాద్‌కు ఎక్స్‌ప్రెస్‌లు ప్రతి అరగంటకు ఒక బస్సును నడిపించాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో బీసీ సంఘాల నేతలు వెంకటేశ్వర్లు, శేఖర్‌లతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

డిసెంబర్ 26న దేవరకొండలో సీపీఐ కవాతు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే యాదగిరిరావు

చింతపల్లి : సీపీఐ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా డిసెంబర్ 26న దేవరకొండలో కవాతు నిర్వహించనున్నట్లు మునుగోడు మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావు తెలిపారు. శనివారం మండలంలోని ఉమ్మాపురంలో నిర్వహించిన సీపీఐ గ్రామ శాఖ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పేదల పక్షాన పోరాడుతున్న ఏకైక పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ అని అన్నారు. దేవరకొండలో డిసెంబర్ 26న సీపీఐ వందేళ్ల విజయోత్సవ సంబరాల్లో భాగంగా భారీ కవాతు ఏర్పాటు చేస్తున్నందున విజయవంతం చేయాలని కోరారు. ప్రజలు రేషన్ కార్డులు లేక చాలా ఇబ్బంది పడుతున్నారని త్వరగా అర్హులందరికీ నూతన రేషన్ కార్డులు అందించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల సహాయ కార్యదర్శి పోలే వెంకటయ్య, బుచ్చయ్య, నరసింహ, వెంకటయ్య శాఖ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

డేటా ఎంట్రీ పరిశీలన

మిర్యాలగూడ టౌన్ : రామచంద్ర గూడెంలోని మీనా ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన సమగ్ర సర్వే డేటా ఎంట్రీ నమోదును శనివారం మున్సిపల్ కమిషనర్ యూసుఫ్ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీలోని 48 వార్డుల్లో సేకరించిన కుటుంబ సమగ్ర సర్వేలో మొత్తం 33 వేల 603కుటుంబాలను సర్వే చేయడం జరిగిందని, అందుకు సంబంధించిన అన్ని వివరాలను ఆన్‌లైన్‌లో నమోద చేస్తున్నట్లు తెలిపారు. విజేత, మీనా ఇంజనీరింగ్, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలకు చెందిన 90కంప్యూటర్లను సేకరించామన్నారు. 140 మంది కంప్యూటర్ ఆపరేటర్ల ద్వారా నమోదు చేయిస్తున్నట్లు తెలిపారు. అనంతరం డేటా ఎంట్రీ తీరును ఆయన పరిశీలించారు.

విద్యార్థినులు, మహిళలకు అండగా షీ టీం



నీరజ హైస్కూల్‌లో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న షీటీం పోలీసులు

మిర్యాలగూడ అర్బన్ : విద్యార్థినులు, మహిళలకు అండగా షీటీం ఉంటుందని షీటీం ఏఎస్‌ఐ షరీఫ్ అన్నారు. శనివారం పట్టణంలోని ప్రకాశ్‌నగర్ లోని నీరజ హైస్కూల్ లో నిర్వహించిన పేరెంట్ టీచర్స్ మీటింగ్‌లో షీ టీంపై అవగాహన కల్పించారు. సైబర్ నేరాలు, సెల్‌ఫోన్ ఉపయోగంపై విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులపై తల్లిదండ్రుల పాత్ర అనే అంశంపై పి.జాషువా వివరించారు. ఈ కార్యక్రమంలో షీ టీం కానిస్టేబుల్ రవీందర్, స్కూల్ ప్రిన్సిపాల్ పి.రాజు, సైదయ్య, పాఠశాల డైరెక్టర్ రమేష్, మట్టయ్య పాల్గొన్నారు.

బీసీల సమరభేరి పోస్టర్ ఆవిష్కరణ

కొండమల్లేపల్లి : హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో ఈనెల 25న నిర్వహించే బీసీల సమరభేరిని విజయమవంతం చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి చింతపల్లి శ్రీనివాస్‌గౌడ్ పిలుపునిచ్చారు. ఈ మేరకు కొండమల్లేపల్లిలో శనివారం నిర్వహించిన బీసీ సంక్షేమ సంఘం మావేశంలో ఆయన ఈ మేరకు సమర భేరి పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఏరుకొండ రాము, శ్రీనివాస్‌యాదవ్, లింగంయాదవ్, వెంకటయ్యగౌడ్, శంకర్, యాదయ్య, జంగయ్య, తోటపల్లి శ్రీను, శ్రీనివాసచారి, శేఖర్ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమాన్ని గాలికి వదిలేసిన ప్రభుత్వాలు

వేములపల్లి (మాడుగులపల్లి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సంక్షేమాన్ని గాలికి వదిలేసి రాజకీయాలు చేస్తున్నాయని మాడుగులపల్లి సీపీఎం మండల కమిటీ సభ్యుడు నగిరె శ్రీను అన్నారు. శనివారం వచ్చే నెల 2,3,4 తేదీల్లో మిర్యాలగూడలో నిర్వహించే సీపీఎం జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ మాడుగులపల్లి మండలంలోని ఇందుగుల గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీకర్, వెంకటాచారి, వెంకన్న, లింగయ్య, పద్మ, శ్యామల, చెన్నయ్య, సతీష్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

మహాసభలను విజయవంతం చేయాలి

దేవరకొండ : డిసెంబర్ 14,15తేదీల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయవాడలో నిర్వహించనున్న యూఎస్‌ఎఫ్‌ఐ అఖిల భారత మొట్టమొదటి మహాసభలు విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు మహ్మద్ సొభాన్ పిలుపునిచ్చారు. శనివారం దేవరకొండ పట్టణంలోని ఉర్దూ మీడియం పాఠశాలలో ఇందుకు సంబంధించిన కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పరశురాం, రవీందర్ పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దు

- కొండమల్లేపల్లిలో ఎస్సీ గురుకుల పాఠశాల, కళాశాలను తనిఖీ చేసిన కలెక్టర్ ఇలా త్రిపాఠి
- కిచెన్, స్టోర్, రిజిస్టర్ల నిర్వహణపై అసంతృప్తి



ఎస్సీ గురుకుల పాఠశాలలో వండుతున్న బియ్యం పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి



ఎస్సీ గరుకుల పాఠశాలలో రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

కొండమల్లేపల్లి: ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని, పరిశుభ్రత, నాణ్యత పాటించకపోయినా, విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించినా చర్యలు తప్పవని కలెక్టర్ ఇలా త్రిపాఠి హెచ్చరించారు. శనివారం కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ ఎస్సీ గురుకుల పాఠశాల, కళాశాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వంట గది, స్టోర్ రూం, తరగతి గదులను పరిశీలించారు. బియ్యం, కూరగాయలకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. వంట గదిలో చెత్త ఉండడంతో ఎందుకు తొలగించలేదని కలెక్టర్ ప్రశ్నించారు. అనంతరం ప్రిన్సిపాల్ గదిలో ఉపాధ్యాయుల రిజిస్టర్, స్టాక్ రిజిస్టర్, ఇండెంట్ రిజిస్టర్‌లను పరిశీలించారు. రిజిస్టర్ల నిర్వహణ సరిగ్గా లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. గత 15 రోజులుగా పాఠశాలకు గుడ్ల సరఫరా లేకపోవడంపై ఇండెంట్ ఎందుకు పెట్టలేదని అసహనం వ్యక్తం చేశారు. ఆ తర్వాత బియ్యం నిల్వ ఉంచిన గదిని తనిఖీ చేశారు. ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సర ఎంపీసీ విద్యార్థులకు ఆర్గానిక్ కెమిస్ట్రీ అంశానికి సంబంధించి కాసేపు వివరించారు. రసాయన పిరాడిక్ టేబుల్ గురించి తెలియజేస్తూ భవిష్యత్‌లో రసాయన శాస్త్రానికి మంచి స్కోప్ ఉందని తెలిపారు. విద్యార్థులతో ముఖాముఖి అయిన కలెక్టర్ వారికి పలు సూచనలు చేశారు. కలెక్టర్ వెంట కొండమల్లేపల్లి తహసీల్దార్ మహమ్మద్ అన్వర్, పాఠశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ సరిత, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

దేవరకొండ : ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. శనివారం దేవరకొండ మండల పరిధిలోని మైనార్టీ రెసిడెన్షియల్, తెలంగాణ బాలికల ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ కళాశాల, కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థినులు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా.. లేదా అని అడిగి తెలుసుకున్నారు. ట్రైబల్ వెల్ఫేర్ కళాశాలలో విద్యార్థినులతో కలిసి సాయంత్రం అల్పాహారం తీసుకున్నారు. అనంతరం దేవరకొండ ప్రాంతీయ ఆస్పత్రిని సందర్శించారు. 200 పడకల ఆస్పత్రి నిర్మాణం నేపథ్యంలో శేరిపల్లి వద్ద భవన నిర్మాణానికి గాను స్థానిక ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్‌తో కలిసి స్థలాన్ని పరిశీలించారు.వారి వెంట ఆర్డీవో రమణారెడ్డి, తహసీల్దార్ సంతోష్‌కిరణ్, మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ తదితరులున్నారు.

రైతులను ఇబ్బందులకు గురిచేస్తే చర్యలు తప్పవు



పత్తి మిల్లు తనిఖీ చేస్తున్న తహసీల్దార్

చింతపల్లి : మండలంలోని సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు లేకుండా పత్తిని కొనుగోలు చేయాలని తహసీల్దార్ రమాకాంత్ శర్మ కోరారు. శనివారం మండల కేంద్రంలోని సీసీఐ కొనుగోలు కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తూకాలలో మోసాలు లేకుండా చూడాలని, లేకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట ఆర్ఐ సునీత, శ్రీనివాస్ రెడ్డి తదితరులు ఉన్నారు.

ఘనంగా దత్తాత్రేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన

త్రిపురారం : మండల కేంద్రంలో అడవి దేవులపల్లి రోడ్డులో దత్తాత్రేయ స్వామి నూతన ఆలయ నిర్మాణం కార్యక్రమంలో భాగంగా దత్తాత్రేయ స్వామి, వినాయక స్వామి విగ్రహప్రతిష్ఠాపన మహోత్సవాన్ని శ్రీ దత్తాత్రేయ భక్త బృందం ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూజారుల సమక్షంలో జ్యోతి ప్రజ్వలన చేసి పూజా కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మూడు రోజుల పాటు పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ ఎంపీపీ అనుముల పాండమ్మ, గౌరవ సలహాదారు అనుముల శ్రీనివాస్ రెడ్డి, త్రిపురారం మాజీ సర్పంచ్ అనుముల శ్రీనివాస్ రెడ్డి, అనుముల వెంకట్ రెడ్డి, మార్తి భారత్ రెడ్డి, జానకి రాం రెడ్డి, జంగిలి శ్రీనివాస్ యాదవ్, అనంత రెడ్డి, నారాయణ గ్రామస్తులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల సంబరాలు



కొప్పోలులో సంబరాలు జరుపుకుంటున్న బీజేపీ నాయకులు

గుర్రంపోడు : మహారాష్ట్రలో బీజేపీ కూటమి విజయంతో కొప్పోలులో ఆ పార్టీ నాయకులు బాణసంచా పేల్చి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించి స్వీట్లు పంపిణీ చేశారు. దేశానికి బీజేపీ మాత్రమే దిక్సూని అని ప్రజలు విశ్వసిస్తున్నారని ఎన్నికల ఫలితాలు తేల్చాయన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు తేలుకుంట్ల రవికుమార్, నాగరాజు, తూటుపల్లి రామకష్ణ, గణేష్, వెంకటేశ్, మహేష్ తదిరులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ ఎరువులపై రైతులకు అవగాహన

అడవిదేవులపల్లి : డీఏపీ ఎరువులకు బదులుగా ప్రత్యామ్నాయ ఎరువుల వాడకంపై మండల కేంద్రంలో రైతులకు శనివారం మండల వ్యవసాయ అధికారి జి. సరిత అవగాహన కల్పించారు. వరి కొయ్యలను కాల్చడం మంచిది కాదని వివరించారు. వరి కొయ్యలను కాల్చడం ద్వారా భూసారం తగ్గుతుందని, భూసారాన్ని పెంచే సూక్ష్మజీవులు చనిపోతాయని, వాతవరణ కాలుష్యం జరుగుతుందన్నారు. రైతులందరూ పీఎం కిసాన్ ఈకేవైసీ, ఆధార్ సీడింగ్ చేయించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు మహేష్‌నాయక్, రావుల నరేష్, రైతులు వెంకటేశ్వర్లు, రామయ్య పాల్గొన్నారు.

దాతల సేవలు అభినందనీయం

పెద్దవూర : నిరుపేద విద్యార్థులు విద్యనభ్యసించే ప్రభుత్వ పాఠశాలలకు దాతలు అందిస్తున్న సేవలు అభినందనీయమని ఎంఈఓ తరి రాములు అన్నారు. శనివారం మండలంలోని తుంగతుర్తి గ్రామానికి చెందిన జానపాటి సతీష్‌యాదవ్ తన తండ్రి జానపాటి కృష్ణయ్య జ్ఞాపకార్థం ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు రూ.18వేల విలువైన ఒక్కో విద్యార్థికి ఒక జత స్పోర్ట్స్ డ్రెస్‌లు, ఐడెంటి కార్డులు, టై, బెల్టులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి దాతలు, స్వచ్ఛంద సేవా సంస్థలు ముందుకు రావాలని కోరారు. సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్న సతీష్‌యాదవ్‌ను అభినందించారు. అనంతరం దాత సతీష్‌ను శాలు వాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం మల్లారెడ్డి, దాత జానపాటి సతీష్‌యాదవ్, కృష్ణ, జానపాటి సాంబయ్య, పాల్గొన్నారు.